ప్రాణం లేని వాయువు

రేపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో నిరుపయోగంగా ఆక్సిజన్ ప్లాంట్

- మరమ్మతులకు నోచుకోని వైనం
- కోవిడ్ సమయంలో ప్రాణాలు నిలిపిన ప్లాంట్
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు, ప్రజా సంఘాలు

రేపల్లె : పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణ వాయువు అందించే ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. ఎందరికో ఆక్సిజన్ అందించే ప్రాణవాయువు ఉత్పత్తి కేంద్రం ప్రాణవాయువు ఉత్తుత్తి కేంద్రంగా తయారయింది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ ప్లాంట్ రోగులపాలిట వరంగా ఉండేది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎంతో మందికి ప్రాణవాయువును అందించిన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ నిర్వీర్యమయ్యే పరిస్థితులు దాపురించి దాత సాయం నీరుగారిపోతోంది. సంవత్సరం క్రితం మరమ్మతులకు గురైన ఆక్సిజన్ జనరేషన్ ప్లాంటును పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ప్రాణ వాయువే అందించే ప్లాంట్ ప్రాణం లేనట్టు తయారయింది.

ప్రాణదాతగా నిలిచింది

కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణవాయువు సకాలంలో అందక ఎందరో మృత్యువుతో పోరాడారు. తీరంలో సైతం కోవిడ్ బారిన పడి పట్టణంలో సరైన వైద్య సేవలు లేక వ్యాధి బారిన పడిన వారిని తెనాలి, గుంటూరులో క్వారంటైన్‌కు పంపి చికిత్సలు అందించి కోలుకున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే తీరంలోనూ ఆక్సిజన్ అందిస్తే ఇక్కడే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడిన ఆక్సిజన్ ప్లాంట్ పలువురికి ప్రాణవాయును అందించి ప్రాణదాతగా నిలిచింది. నేటికి ఆయాసం, ఉబ్బసం వంటి వ్యాధులతో బాధపడే వారికే కాకుండా ఆపత్కాలంలో వైద్యశాలకు వచ్చే వారికి ఆక్సిజన్ అందిస్తూ ప్రాణాలను నిలుపుతోంది.



మరమ్మతులకు గురైన ప్రభుత్వ వైద్యశాలలోని ఆక్సిజన్ ప్లాంట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022 జనవరి 21వ తేదీన రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ, హిందుస్థాన్ కోకోకోలా బెవరేజస్ సంస్థల సహకారంతో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను నెలకొల్పారు. నాటి నుంచి అనేక విధాలుగా ప్రాణవాయువును అందిస్తూ సేవలు అందిస్తున్న ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ సంవత్సరం క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో రోగులకు సకాలంలో ప్రాణవాయువు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

వైద్యశాలలోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ మరమ్మతులకు గురైందని, మరమ్మతులకు రూ.66 వేలు అవసరమని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం వైద్యశాలలో చికిత్సలు పొందుతున్న రోగులకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువస్తాం.

– సుధాకర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాల

కోవిడ్ సమయంలో రేపల్లెలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌లో చికిత్సలు పొందిన పలువురికి ఆక్సిజన్‌ను అందించింది. అయితే ప్రస్తుతం దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సంకట స్థితిలో ఉన్న ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

వినియోగంలోకి తేవాలి

ప్రాణవాయువు అందక ఎవరూ ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో రేపల్లె తీరప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాణ వాయువు ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించేందుకు నేటి కూటమి నేతలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా కూటమి నేతలు, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు, ప్రజా సంఘాలు బహిరంగంగానే ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జనరేషన్ ప్లాంట్‌కు మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

31వ తేదీనే పింఛన్ల పంపిణీ

చెరుకుపల్లి: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మే నెల 31వ తేదీ శనివారం పంపిణీ చేయటం జరుగుతుందని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ జూన్ 1వ తేదీ ఆదివారం కావటంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మే 30వ తేదీనే బ్యాంకుల నుంచి పింఛన్ల నగదు డ్రా చెయ్యాలని ఆదేశించారు. మండలంలో 9,770 మంది లబ్ధిదారులకు రూ.4,23,83,500 నగదును 177 మంది సిబ్బంది పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. గత నెలలో తీసుకోని లబ్ధిదారులకు రెండు నెలల పింఛన్ నగదు అందించటం జరుగుతుందని, కావున 31వ తేదీన లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండాలని ఎంపీడీవో సూచించారు.

వేమూరు ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతలు



వేమూరు: వేమూరు పోలీసు స్టేషన్ ఎస్ఐగా జి.శ్రీనివాసరావు బాధ్యతలు బుధవారం చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన రవికృష్ణ బదిలీపై సైబర్ ఎస్ఐగా వెళ్లారు. బాపట్ల జిల్లా ఎస్పీ కార్యాలయం వీఆర్‌లో పని చేస్తూ వేమూరు ఎస్ఐగా జి.శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమర్తలూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రవితేజ



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు ఎస్ఐగా కె.రవితేజ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అమర్తలూరు ఎస్ఐగా పని చేసిన జానకి అమర్‌వర్ధన్ బదిలీపై కొల్లూరు ఎస్ఐగా వెళ్లారు. ఆయన స్థానంలో అద్దంకి ఎస్ఐగా పనిచేస్తున్న రవితేజ బదిలీపై అమర్తలూరు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

కొల్లూరు ఎస్ఐగా అమరవర్ధన్




కొల్లూరు : కొల్లూరు మండలానికి నూతన ఎస్ఐను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో జానకి అమరవర్ధన్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొల్లూరు ఎస్ఐగా పనిచేస్తున్న జి.ఏడుకొండలును ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపడంతో గత రెండు నెలలుగా కొల్లూరు ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. అప్పట్నుంచి వేమూరు ఎస్ఐ రవికృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా పోలీసు అధికారులు నియోజకవర్గంలోని అమృతలూరు ఎస్ఐగా పనిచేస్తున్న జె.అమరవర్ధన్‌ను కొల్లూరు ఎస్ఐగా నియమించడంతో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

125 మందికి ఉచిత కంటి పరీక్షలు



కర్లపాలెం: కంటి సమస్యలకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని రేపల్లె ఫోకస్ కంటి హాస్పిటల్ నేత్ర వైద్యుడు కిషోర్ చెప్పారు. రెడ్డి సేవా మిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంగు గోవర్ధనరెడ్డి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సమ్మెటవారిపాలెం పంచాయతీ పరిధిలోని శీలంవారిపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రేపల్లె ఫోకస్ కంటి హాస్పిటల్ వైద్యుడు కిషోర్ శిబిరంలో 125 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్డి సేవా మిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన వారిలో 40 మందికి కళ్లజోళ్లు, మరో 30 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు గుర్తించారని తెలిపారు. శుక్లాల ఆపరేషన్‌ను రేపల్లెలోని ఫోకస్ హాస్పిటల్‌లో ఉచితంగా చేస్తారని, కళ్లజోళ్లు అందించబడునని చెప్పారు. అవరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారు.

మురుగు సమస్య పరిష్కరించేందుకు చర్యలు



తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న పూడిక తీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

కిశోర బాలికలకు హైజీన్‌పై అవగాహన కల్పించాలి

ఆర్‌కేఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్



బాపట్ల: కిశోర బాలికలకు మెన్సురల్ హైజీన్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ కిరణ్ పేర్కొన్నారు. బాపట్లలోని వెదుళ్ళపల్లి వైద్యశాలను బుధవారం ఆయన తనిఖీ చేసి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైజీన్‌పై ప్రతి ఒక్క బాలికకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య శాఖపై ఉందన్నారు. వివాహ వయస్సు, కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ రత్నమోహన్, వెదుళ్ళపల్లి వైద్యాధికారి డాక్టర్ మానసాప్రియదర్శి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

రేపల్లె: టీడీపీ వ్యవస్థాపకులు, సినీ నటుడు ఎన్టీఆర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నటునిగా, ప్రజా సేవకునిగా ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ బాలగురవయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్

కర్లపాలెం: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వినియోగించుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ చెప్పారు. సెర్ప్ సౌజన్యంతో యూనియన్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో డ్వాక్రా మహిళ, దమ్మునవారిపాలెం సర్పంచ్ గురవుసాల వెంకటేశ్వరమ్మ, జగ్గయ్య ఏర్పాటు చేసిన శ్రీదుర్గా గానుగ ఆయిల్ మిల్లును బుధవారం కె.శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్తను, ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ స్కీమ్ ద్వారా సెర్ప్ సౌజన్యంతో గానుగ మిల్లును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఓఎన్‌డీసీ యాప్ ద్వారా మల్టీ మిలియనీర్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ ఇస్తుందని శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి అరుణ్‌కుమార్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ సువార్తమ్మ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ ఆర్‌డీఓ మనోజ్, ఎల్‌డీఎం శివరామకృష్ణ, డీపీఎం ఎల్‌హెచ్ రవీంద్రబాబు, మండల సమాఖ్య ప్రతినిధులు, ధనలక్ష్మి, నసీమా, సీసీలు, రాఘవ, శివప్రభ ఉన్నారు.


శ్రీదుర్గా ఆయిల్ మిల్లును ప్రారంభించిన డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని 31న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

సైక్లిస్టుని ఢీకొట్టిన మైనర్లు

తెనాలిరూరల్: సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని మైనర్లు స్కూటీతో ఢీకొట్టిడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని ఖాజీపేట వద్ద బుధవారం 54 ఏళ్ల వ్యక్తి సైకిల్‌పై వెళుతున్నాడు. స్కూటీపై వెళుతున్న ముగ్గురు మైనర్లు ఆయన్ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు సమస్య పరిష్కరించేందుకు చర్యలు

కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో రోడ్లపై నీరు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

తెనాలిఅర్బన్: ఫర్ ది లిస్ట్ ఆఫ్ దెమ్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద యానాదులకు బుధవారం బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ యానాది సమాజిక వర్గానికి చెందిన నిరుపేదలకు సహాయం చేయడం సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెం వెళ్లే రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. యర్రబాలెం నుంచి కృష్ణాయపాలెంకు ద్విచక్రవాహనంపై హఫీజ్ వెళుతున్నాడు. ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న రమేష్‌ను హఫీజ్ ఢీ కొన్నాడు. ఈ ఘటనలో వాహనాలు నడుపుతున్న ఇద్దరు యువకులు గాయపడ్డారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం

తెనాలిటౌన్: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో నిర్వహించిన కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 10 విజేతలుగా గుంటూరు మిర్చిటీం గెలిచినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు కావేటి వేణుగోపాల్ తెలిపారు. గుంటూరు మిర్చిటీంకు రూ.10,516లు నగదు బహుమతి, మెమోంటో అందజేశారు. అదే విధంగా రన్నర్స్‌గా నిలిచిన సూపర్ కింగ్ టీంకు రూ.5,116లు నగదు బహుమతి, మెమోంటో అందజేశారు. ప్రతి ఏటా కావేటి యలమందరావు స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించేందుకు తోడ్పడిన వీఎస్సార్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోలా అశోక్, కనకచారి, కావేటి సాంబ్రాజ్యం, ఆనంద్‌కుమార్, వెంకటేశ్వర్లు, మణికంఠ, పాశం వెంకటేష్, అన్నం రాజేష్, శ్రీను, ఎం.కిరణ్‌బాబు ఉన్నారు.


బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రం, చెంచుపేటలోని ఎస్ఎల్ఎస్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన యోగ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా భాగం కావాల్సిన అవసరం ఉందన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి దూరం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

చిన్నారికి నాట్యమయూరి అవార్డు

మంగళగిరి టౌన్: మంగళగిరికి చెందిన మునగాల జయ అక్షితకు నాట్యమయూరి అవార్డు లభించింది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి 40వ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీత, నృత్య పోటీల్లో అక్షిత పాల్గొని ప్రతిభ కనబరిచింది. కూచిపూడి 'ఏ' గ్రూప్‌లో భామాకలాపం నృత్య ప్రదర్శనకు ప్రథమ బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళానిలయం ఆధ్వర్యంలో అక్షితకు నాట్యమయూరి అవార్డును ప్రదానం చేశారు. అక్షిత మంగళగిరి నగర పరిధిలోని ఓ ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదవుతోంది. అవార్డు పొందిన అక్షితను తల్లిదండ్రులు మునగాల మురళీకృష్ణ, మౌనికలతో పాటు నగర పరిధిలోని పలువురు ప్రముఖులు అభినందించారు.


అవార్డు అందుకుంటున్న అక్షిత

తెనాలి పోలీసుల తీరుపై సమగ్ర విచారణ జరపాలి

పెదకాకాని: దళిత, మైనార్టీ యువకుల పట్ల తెనాలి పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని.. సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ బుధవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 24వ తేదీన పోలీసు కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై నిందితులు దాడి చేశారని ఎస్సీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన యువకులను నడిరోడ్డుపై ఇష్టానుసారంగా కొట్టి గాయపరచిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితులను కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థపై గౌరవం పెరగాలి కానీ నమ్మకం కోల్పోవడం, వ్యతిరేకత ఏర్పడటం సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదిత్య హృదయ పారాయణం, శృంగార నైషధంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఆధ్యాత్మిక ప్రవచకురాలు డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రవచిస్తూ పాకిస్థాన్‌తో యుద్ధంలో భారత దేశానిదే పైచేయి కావాలని అన్నారు. కోవిడ్-19 బారిన పడకుండా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. భాగవత గోష్ఠితో మూడుసార్లు ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించారని అన్నారు. అనంతరం శృంగార నైషధంలోని ఇతివృత్తాన్ని వివరించారు.



ప్రార్థనా మందిరాలపై విచారణ నిలిపివేయాలి

కర్లపాలెం: క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై జరుగుతున్న విచారణను తక్షణమే నిలిపివేయాలని కర్లపాలెం మండలంలోని పాస్టర్లు కోరారు. సచివాలయ సిబ్బంది క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై చేస్తున్న విచారణను తక్షణమే నిలిపివేయాలని మండల పరిధిలోని పాస్టర్లు బుధవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ మంగళవారం నుంచి సచివాలయ సిబ్బంది ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా గ్రామాలలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల వివరాలను సేకరించటంపై అభ్యంతరం తెలిపారు. గత కొన్ని నెలల క్రితం కూడా ఈ విధంగానే విచారణ చేస్తూ ఉండటంతో.. రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు తెలియజేయగా ఆయన వెంటనే విచారణ నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. మరలా ఇప్పుడు ప్రార్థనా మందిరాల వివరాలను సేకరించటం సమంజసం కాదని వెంటనే నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాస్టర్లు ఎం.రమేష్, బి.లాభాన్‌రాజు, ప్రసంగి, కాగిత డేవిడ్, షద్రక్, సముయేలు, ప్రకాష్ జనార్ధన్‌రావు, నతానియేలు, పౌలు తదితరులు ఉన్నారు.


ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని వినతి

వేమూరు: కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని ఆపరేటర్లు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుశీలకు బుధవారం వినతపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు బొనిగల అగస్టీన్ ఆధ్వర్యంలో వేమూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సరం తర్వాత ఎండీయూ ఆపరేటర్లపై వేటు వేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రతి ఇంటికి రేషన్ అందజేయాలని ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం సరికాదని, కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించకపోతే ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఎండీయూ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ రఫీ, దొప్పలపూడి మున్నా, చావలి అమరేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారు సుశీలకు వినతపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రెండేళ్ల తర్వాత సోదరుడికి అప్పగింత

నగరంపాలెం: మతిస్థిమితం లేని ఓ యువకుడ్ని జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండేళ్ల క్రితం పొన్నూరు బస్టాండ్ వద్ద మతిస్థిమితం సరిగాలేని 15 ఏళ్ల యువకుడ్ని జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఏఎస్ఐ బేబిరాణి గుర్తించారు. అతని సంరక్షణార్థం గుంటూరు నగరంలోని కార్మెల్ హోంలో చేర్పించారు. సదరు యువకుడి కుటుంబ సభ్యులను గుర్తించేందుకు హోం ఇన్‌చార్జి వీరశంకర్, ఏఎస్ఐ బేబిరాణి అనేక విధాలుగా ప్రయత్నించారు. ఈ క్రమంలో అతని వేలిముద్రల ఆధారంగా ఆధార్ కార్డు గుర్తించారు. మహారాష్ట్ర థానే జిల్లా తిలక్‌నగర్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మతిస్థిమితం సరిగా లేని యువకుడి పేరు నవనాథ గంగారంషిండే అని సోదరుడు వైభవ్ గంగారం షిండే బుధవారం తెలియజేశారు. దీంతో అతన్ని సోదరుడికి అప్పగించారు. యువకుడ్ని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన హోం ఇన్‌చార్జి వీరశంకర్, సిబ్బందిని, ఏఎస్ఐ బేబిరాణిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.


నవనాథగంగారంషిండేను సోదరుడికి అప్పగిస్తున్న హోం నిర్వాహకులు, ఏఎస్ఐ బేబిరాణి

ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నివారించాలి

ఎంపీడీవో ఎస్.సుదీప

చుండూరు(వేమూరు): ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు నివారించాలని ఎంపీడీవో ఎస్.సుదీప అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై గ్రామ సచివాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ఘన వ్యర్థాల షెడ్డును వినియోగించాలన్నారు. సైడ్ కాలువలు శుభ్ర పరుచుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలకు సురక్షితమైన, శుభ్రమైన నీటిని అందించాలని ఆమె కోరారు. గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిని, మండల పరిషత్ పరిపాలన అధికారి సుధారాణి, పంచాయతీ కార్యదర్శి వినయబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

